# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 9, మే 2026




## పేద కుటుంబాలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

✳ మంత్రి వివేక్ వెంకటస్వామి

**మందమర్రి, మే 8, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం మందమర్రి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులకు స్వయంగా చెక్కులు అందజేశారు. మందమర్రి మండలం, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు ఈ సందర్భంగా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పలు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాల సందర్భంగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఎంతో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల లబ్ధి చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం కట్టుబడి ఉందని, సంక్షేమ పాలనతో రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని మంత్రి స్పష్టం చేశారు. సామాన్య ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తుమ్మిడిహెట్టి పునరుద్ధరణకు

# ప్రజా ప్రభుత్వం కృషి



- ★ ప్రాణహిత నదికి జల హారతి ఇచ్చిన మంత్రులు
- ★ కాళేశ్వరం ప్రాజెక్టుతో గత ప్రభుత్వం వృధా ఖర్చు
- ★ బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు సహకరిస్తేనే ప్రాజెక్టు కల సహకారం
- ★ మంత్రులు జూపల్లి, వివేక్

**కౌటాల, మే7, ప్రభాతవార్త;**

తెలంగాణ సాగునీటి రంగానికి పూర్వవైభవం తీసుకురావాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి, పర్యాటకసాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం తుమ్మిడిహెట్టి ప్రాంతాన్ని మంత్రులు జూపల్లి కృష్ణారావు, గడ్డం వివేక్ వెంకటస్వామి సందర్శించి ప్రాణహిత నదికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. అనంతరం ప్రతిపాదిత తుమ్మిడిహెట్టి బరాజ్ ప్రాంతాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బరాజ్ ఎత్తు, సామర్థ్యం, గతంలో చేపట్టిన పనులు, మహారాష్ట్రలోని శివిని గ్రామ ముంపు పరిధి, అటవీ పర్యావరణ అనుమతులు తదితర అంశాలపై సాగునీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వం పక్కనబెట్టిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు పునరుజ్జీవం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2008లో రూ.38,500 కోట్ల అంచనా వ్యయంతో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహితచేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుకు భూమిపూజ చేశారని గుర్తుచేశారు. అనంతరం వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును విస్మరించి కాళేశ్వరం పేరుతో భారీగా ప్రజాధనం ఖర్చు చేసిందని విమర్శించారు. గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశం ఉన్నప్పటికీ, పంపుల ద్వారా ఎత్తిపోతల విధానాన్ని అమలు చేయడంతో రాష్ట్రంపై భారీ ఆర్థిక భారం పడిందని పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మాణం జరిగితే ఒక్క యూనిట్ విద్యుత్ ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని తరలించవచ్చని, దీని ద్వారా సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు ప్రాంతాల మిగతా 2లో..



## స్వీయ గణనతో జనగణన సులభతరం

✦ మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య

**నస్పూర్, మే 8, ప్రభాతవార్త**




జనగణన 2027లో భాగంగా స్వీయ గణనతో కార్యక్రమం సులభతరం అవుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐ.బి. చౌరస్తా నుండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వరకు చేపట్టిన మారథాన్ వాక్ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్, జిల్లా షెడ్యూల్డ్ కలముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా యువజన క్రీడాసేవల అధికారి హనుమంత రెడ్డి, జిల్లా ఉపగణాంక అధికారి రాజేందర్ ఇతర అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్వీయ గణనపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు మారథాన్ వాక్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరికీ తెలిసేలా ప్ల కార్డులు ప్రదర్శించడంతో పాటు ప్రజలను స్వీయ గణనలో భాగస్వాములు కావాలని కోరుతూ నినాదాలు చేయడం జరిగిందని తెలిపారు. మన మిగతా 2లో..

## వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

✪ కలెక్టర్ కుమార్ దీపక్

**హాజీపూర్, మే 08, ప్రభాతవార్త**

వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని గుడిపేట, సబ్బపల్లి, గొల్లపల్లి, పెద్దంపేట, దొనబండ గ్రామాలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను హాజీపూర్ మండల తహసిల్దార్ పుష్పలతతో కలిసి సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల వద్ద నుండి మద్దతు ధర చెల్లించి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, ఈ క్రమంలో హాజీపూర్ మండలంలో 20 కొనుగోలు మిగతా 2లో..



# తుమ్మిడిహెట్టి పునరుద్ధరణకు ప్రజా ప్రభుత్వం కృషి

**(మొదటిపేజీ తరువాయి)**

రైతులకు మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల మేర బరాజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించాలని కోరనున్నట్లు తెలిపారు. శివిని గ్రామానికి ఎలాంటి ముంపు సమస్య ఉండదని, భూములు కోల్పోయే వారికి పరిహారం అందిస్తామని పేర్కొన్నారు.

ప్రాజెక్టు విషయంలో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు మానుకొని రాష్ట్ర ప్రయోజనాల కోసం సహకరించాలని మంత్రి సూచించారు. సాగునీటి రంగాన్ని గాడిలో పెట్టేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.ఇదే సందర్భంగా రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ప్రాణహిత ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి నుంచి కాళేశ్వరం వైపు మళ్లించడం వల్ల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కమిషన్ల కోసమే ప్రాజెక్టును తరలించారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై భారీగా ఖర్చు చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదన్నారు. ప్రాణహిత ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించవచ్చని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు వల్ల మహారాష్ట్రకు ఎటువంటి నష్టం ఉండదని, త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి బిజెపి ఎమ్మెల్యేలు, ఎంపీలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, పాల్వాయి హరీష్ బాబు, జిల్లా కలెక్టర్ హరిత , జిల్లా ఎస్పీ నితికా పంత్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, అదనపు కలెక్టర్ డేవిడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దల దేవయ్య, మాజి ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డిసి ఎమ్మెస్ వైస్ చైర్మన్ కొమరం మాంతయ్య, తాహాశీల్దార్ ప్రమోద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఆత్రం సుగుణ, జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం జానకిరామ్, నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు

**- రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు**

**కాగజ్‌నగర్,మే 8, ప్రభాతవార్త :**



అర్హత గల ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాగజ్‌నగర్ పట్టణంలోని సిర్పూర్ పేపర్ మిల్ క్లబ్ లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్లు, రెండు పడక గదుల పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఆదిలాబాద్ శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె. హరిత, ఎస్.పి. నితికా పంత్, జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, సిర్పూర్ నియోజకవర్గ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ బాబు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్రే అనిల్, కాగజ్ నగర్ మున్సిపల్ చైర్ పర్సన్ షాహిన్ సుల్తానా లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రికి మాట్లాడుతూ జిల్లాలో రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందని తెలిపారు. బోరిగాం శివారులో నిర్మించిన 2 పడక గదుల ఇండ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడం సంతోషంగా ఉందని తెలిపారు. కాగజ్ నగర్ పట్టణానికి మొదటి విడతలు 630 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయడం జరిగిందని, మొదటి విడతలో రానివారు నిరాశ చెందవలసిన అవసరం లేదని, అర్హత గల వారికి రెండవ విడతలు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. కాగజ్ నగర్ పట్టణ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, రహదారి విస్తరణ, మురుగు కాలువల వ్యవస్థ, సి సి రహదారుల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న వంతెనల పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొమురం భీం ప్రాజెక్టు ఆనకట్ట పనులు సి డబ్ల్యూ సి నివేదిక రాగానే ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.శాసనమండలి సభ్యులు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. కాగజ్ నగర్ పట్టణ అభివృద్ధికి 18 కోట్ల రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతామని తెలిపారు. మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అందజేయడంలో ప్రభుత్వం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. సిర్పూర్ శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రాణహిత నదిపై బరాజ్ నిర్మాణం చేపడితే ఈ ప్రాంతానికి సాగునీరు అంది భూములు సస్యశ్యామలం అవుతాయని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణానికి ప్రజా ప్రతినిధులు అందరూ సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. కాగజ్ నగర్ పట్టణ అభివృద్ధికి అదనంగా నిధులు మంజూరు చేయాలని, పోడు భూములను సాగు చేయకుండా అటవీ అధికారుల అడ్డుపడుతున్న సమస్యను పరిష్కరించాలని, కార్మికుల సంక్షేమం కోసం సిర్పూర్ పేపర్ మిల్ యాజమాన్యం దృష్టి సారించాలని తెలిపారు.అనంతరం 288 మంది లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పి.డి. టి.ఎన్. ప్రకాష్ రావు, మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌కు సన్మానం

**తాండూర్, మే 8, ప్రభాతవార్త :**

తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన పెద్ద బోయిన శంకర్ ను శుక్రవారం గోపాల్ నగర్ సర్పంచ్ ఆధ్వర్యంలో నాయకులు, ప్రజలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాట్ల నరసయ్య, ఉప సర్పంచ్ గాజుల రామ్మోహన్, వార్డు సభ్యులు, గజ్జల గోవర్ధన్, గాజుల సురేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఉట్నూరి అంజి, సాయి, పెండ్యాల శ్రీనివాస్, అశోక్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



## భట్టుపల్లి - జీడిచేను బీటీ రోడ్డు సమస్యపై మంత్రి జూపల్లికి వినతి

**కాగజ్‌నగర్ రూరల్, మే 8, ప్రభాతవార్త :**



కాగజ్‌నగర్ మండలంలోని భట్టుపల్లి గ్రామంలో నెలకొన్న పలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామ సర్పంచ్ రాజేందర్ జాదవ్ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా భట్టుపల్లి ట్రాన్స్‌ఫార్మర్ నుండి జీడిచేను వాటర్ ట్యాంక్ వరకు పూర్తిగా దెబ్బతిన్న బీటీ రోడ్డును పునర్నిర్మించాలని కోరారు. అలాగే ధ్వంసమైన డ్రైనేజీ కాలువలను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.రోడ్ల దుస్థితి కారణంగా రైతులు, విద్యార్థులు, గ్రామ ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ వివరించారు. సమస్యలపై స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు తో పాటు ఎమ్మెల్సీ దండే విఠల్ సానుకూలంగా స్పందించి, అవసరమైన నిధులు మంజూరు చేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు మారిశెట్టి రాజేష్, పర్వతి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి

**(మొదటిపేజీ తరువాయి)**

కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి రైతులకు నగదు చెల్లింపు త్వరగా పూర్తి చేయాలని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా కొనుగోలు పూర్తి చేయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద నుండి తీసుకున్న ధాన్యాన్ని ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గోదాములలో నిబంధనల ప్రకారం నిల్వ చేయాలని తెలిపారు. లారీలు, అందుబాటులో ఉన్న ట్రాక్టర్ల ద్వారా ధాన్యం తరలించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, జిల్లాలో ఇప్పటి వరకు 12 రైస్ మిల్లులు పని చేస్తున్నాయని, 6 గోదాములు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సుముఖ గోదాం సామర్థ్యం 35 వేల మెట్రిక్ టన్నులు ఉండగా దాదాపు 50 హమాలీల ద్వారా ధాన్యం దిగుమతి, నిల్వ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గోదాముల సామర్థ్యం, హమాలీల సంఖ్యను పూర్తిగా వినియోగిస్తూ నిల్వలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రోజుకు 15 లారీలు రావాల్సి ఉండగా ప్రస్తుతం 12 లారీల ధాన్యం దిగుమతి అవుతుందని, ఇప్పటి వరకు 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, మాసాంతం వరకు 80 శాతం కొనుగోలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులు నిబంధనల ప్రకారం తప్ప, తాలు, మట్టి గడ్డలు, తేమ లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద ధ్రువీకరించుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో మిల్లింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, రవాణా వాహనాలను మిల్లులకు తగిన విధంగా కేటాయించి, వరి ధాన్యం రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి అంతరాయాలు రాకుండా, హమాలి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని తెలిపారు. అనంతరం జైపూర్ మండల కేంద్రంలోని సుముఖ ఆగ్రో ఇండస్ట్రీస్ గోదామును సందర్శించి ధాన్యం నిల్వ చేసే ప్రదేశం, అనుకూల పరిస్థితులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# స్వీయ గణనతో జనగణన సులభతరం

**(మొదటిపేజీ తరువాయి)**

వివరాలు మనమే నమోదు చేద్దామని, స్వీయ గణనతో జనగణన సులభతరం అవుతుందని, జన గణన విజయవంతం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ఖచ్చితమైన జనాభా గణాంకాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే సంక్షేమ, అభివృద్ధి పథకాల రూపకల్పనకు ఎంతో కీలకమని తెలిపారు. ప్రజలు స్వీయ గణన సదుపాయాన్ని వినియోగించుకుని ఈ నెల 10వ తేదీలోగా తమ వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వీయ గణన పూర్తి చేసి దేశ అభివృద్ధిలో భాగస్వామ్యంలో కావాలని తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం ద్వారా స్వీయ గణనపై పాటలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, యువత, ప్రజలు పాల్గొన్నారు.

## కళ్యాణి లక్ష్మి చెక్కులు పంపిణీ

**తాండూర్, మే 8 ప్రభాతవార్త :**



తాండూర్ మండలానికి చెందిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు శుక్రవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పంపిణీ చేశారు.కార్యక్రమంలో తహసిల్దార్ జ్యోత్స్న, నాయకులు ఎండి ఈసా, శంకర్, సురేష్, తిరుపతి, శ్రీనివాస్, సత్యం, భూమయ్య, రామకృష్ణ, శంకర్,తదితరులు పాల్గొన్నారు.

## బైక్ అదుపుతప్పి యువకుడు మృతి

**సిరికొండ, మే 08, ప్రభాతవార్త:**

రోడ్డుపై ఉన్న గుంతను తప్పించబోయి బైక్ అదుపుతప్పి కింద పడటంతో ఓ యువకుడు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుంకిడి గ్రామానికి చెందిన సిడం మారుతి (26) గ్రామ పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నారు. గురువారం సాయంత్రం ఇచ్చోడ నుండి బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా రాయిగూడ సమీపంలో ప్రమాదం జరిగింది. గుంతను తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి కింద పడటంతో మారుతి తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఇచ్చోడలోని ఆస్పత్రికి, అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మృతుని తండ్రి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిరికొండ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మారుతి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

# భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

## - బంగారు వ్యాపారులు, గోల్డ్ లోన్ సంస్థలకు ఏసీపీ కిరణ్‌కుమార్ సూచన

**మందమర్రి, మే 8, ప్రభాతవార్త**



బ్యాంకులకు, వ్యాపార సంస్థలకు సూచనలు ఇస్తున్న పోలీసు అధికారులు

బంగారు ఆభరణాల వ్యాపారులు, ప్రైవేట్ గోల్డ్ లోన్ సంస్థల నిర్వాహకులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులను గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం మందమర్రిలోని ఇల్లందు క్లబ్‌లో బెల్లంపల్లి సబ్‌డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో బ్యాంకులు, ప్రైవేట్ గోల్డ్ ఫైనాన్స్ సంస్థలు, గోల్డ్ షాపులు, లాడ్జిల యజమానులు, మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నేరాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఇటీవల ప్రాంతంలో వరుస దొంగతనాలు చోటుచేసుకుంటున్నాయని, ముఖ్యంగా దొంగలు బంగారు ఆభరణాలనే లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో బ్యాంకులు, గోల్డ్ లోన్ సంస్థలు, ఆభరణాల వ్యాపారులు తమ భద్రతా వ్యవస్థలను మరింత పటిష్టం చేసుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులకు లాడ్జిల్లో గదులు కేటాయించే ముందు వారి ఆధార్ కార్డుతో అనుసంధానమైన ఫోన్ నంబర్లను పరిశీలించి పూర్తి వివరాలు ధృవీకరించిన అనంతరమే గదులు ఇవ్వాలని సూచించారు. అనుమానాస్పదంగా అనిపించే వ్యక్తుల కదలికలను వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. వ్యాపార సంస్థలు ఆధునిక సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి 24 గంటల పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఫైర్ సైరన్‌లు, అలారం వ్యవస్థలను కూడా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గన్ లైసెన్స్ కలిగిన వ్యక్తులను భద్రతా సిబ్బందిగా నియమిస్తే సంస్థలకు మరింత రక్షణ కల్పించవచ్చని పేర్కొన్నారు. నేరం జరిగిన తర్వాత ఫిర్యాదు చేయడం కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రాంతాన్ని నేరరహితంగా ఉంచడం సాధ్యమవుతుందని, దీనికోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బెల్లంపల్లి రూరల్ సీఐ హనుక్, బెల్లంపల్లి వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, మందమర్రి సీఐ పర్స రమేష్, బెల్లంపల్లి ఎస్ఐలు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, గోల్డ్ షాప్ యజమానులు, లాడ్జ్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు అందజేస్తున్న అధికారులు

## బీరవెల్లిలో పశుసంవర్ధక సేవా శిబిరం

**సారంగాపూర్, మే 08, ప్రభాతవార్త:**

మండలంలోని బీరవెల్లి గ్రామంలో శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పశువుల కోసం ప్రత్యేక సేవా శిబిరం నిర్వహించారు. పశు వైద్యాధికారి నందకుమార్ నేతృత్వంలో జరిగిన ఈ శిబిరంలో పశువులకు ఉచిత వైద్యం, టీకాలు, సలహాలు అందించారు. పశువులలో సాధారణంగా కనిపించే జ్వరం, గాయాలు, కడుపు నొప్పి వంటి సమస్యలకు చికిత్స చేసి అంటువ్యాధులకు సంబంధించిన టీకాలు వేశారు. పశువుల సంతానోత్పత్తిని మెరుగుపరచడానికి కృత్రిమ గర్భధారణ సేవలను అందుబాటులో ఉంచి మెరుగైన జాతి పశువుల పెంపకంపై రైతులకు మార్గనిర్దేశం చేశారు. పాల దిగుబడిని పెంచేందుకు అవసరమైన సలహాలు ఇచ్చి గడ్డి విత్తనాలను పంపిణీ చేశారు. వేసవి కాలంలో పశువుల సంరక్షణపై అవగాహన కల్పిస్తూ వడదెబ్బ తగలకుండా చల్లని ప్రదేశాలలో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగవ్వ ఎల్లన్న, పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



రైతులతో కలిసి ధర్నా చేస్తున్న బాజీరావు పాటిల్

## మొక్కజొన్నను వెంటనే కొనుగోలు చేయాలి

### - బాజీరావు పాటిల్

**భైంసా, మే 08, ప్రభాతవార్త:**

తానూర్ మండల కేంద్రంలో రైతుల మొక్కజొన్నను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ముధోల్ నియోజకవర్గ యువ నేత బాజీరావు పాటిల్ రైతులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే రైతులకు సంచులను అందించి మొక్కజొన్నను కొనుగోలు చేయాలని, తానూర్ మండలంలో రెండు కొత్త కొనుగోలు సబ్ సెంటర్లను ఆమోదించాలని కోరారు. స్థానిక గోదాముల వద్ద వర్షానికి తడిచిన మొక్కజొన్నను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, కేంద్రాల వద్ద జరుగుతున్న అవినీతిని అరికట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల వద్ద ఉన్న పూర్తి ధాన్యాన్ని ఎప్పటిలోపు కొంటారో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. అనంతరం తహసీల్దార్, మార్క్ ఫెడ్ చైర్మన్ తో మాట్లాడి రైతుల డిమాండ్లను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

### - జిల్లా గిరిజన అభివృద్ధి సంక్షేమ అధికారిణి రమాదేవి

**ఆసిఫాబాద్, మే 8 (వార్త ప్రతినిధి):**

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో కూడా చురుకుగా పాల్గొని సమగ్ర అభివృద్ధి సాధించాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన టీడబ్ల్యూ సమ్మర్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు భావనతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్‌లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభను అభినందించారు. 15 రోజుల పాటు క్యాంప్‌ను విజయవంతంగా నిర్వహించిన ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, కోచ్‌లు, ఉపాధ్యాయులు, సిబ్బందిని అధికారులు అభినందించారు. అనంతరం విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్లు, షూస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఓ ఉద్ధవ్, స్పోర్ట్స్ ఆఫీసర్ షేకూ, హెడ్‌మాస్టర్ లింభారావ్, జీసీడీఓ శకుంతల, హెచ్‌డబ్ల్యూఓ సాయిబాబా, పీడీలు కనక వెంకటేశ్వర్లు, మంగావతి, కృష్ణమూర్తి, కోచ్‌లు అరవింద్, రాకేష్, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.





నర్సాపూర్లో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరం

## నర్సాపూర్లో ఉచిత పశువైద్య శిబిరం

**తాండూర్, మే 8, ప్రభాతవార్త :**

మండలం నర్సాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బెజ్జాల గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 25 పశువులకు, 6 మేకలకు పశు వైద్యశాల డాక్టర్లు నరసింహారావు, శివప్రసాద్ చికిత్స చేశారు. అనంతరం వేసవికాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, సూచనలపై అవగాహన కల్పించారు. పశువులు, మేకల యజమానులకు సర్పంచ్ ప్రభాత్ రావు, డాక్టర్లు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పర్వతరావు, వార్డ్ మెంబర్ బాదు, పశువైద్య సిబ్బంది కళ్యాణ్, సాయికుమార్ పాల్గొన్నారు.



# సుంక్లీలో పశుసంవర్ధక సేవా శిబిరం

**భైంసా, మే 08, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని సుంక్లీ గ్రామంలో శుక్రవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పశువుల కోసం ప్రత్యేక సేవా శిబిరం నిర్వహించారు. పశు వైద్యాధికారి విట్టల్ నేతృత్వంలో జరిగిన ఈ శిబిరంలో పశువులకు ఉచిత వైద్యం, టీకాలు, సలహాలు అందించారు. పశువులలో సాధారణంగా కనిపించే జ్వరం, గాయాలు, కడుపు నొప్పి వంటి సమస్యలకు చికిత్స చేసి అంటువ్యాధులకు సంబంధించిన టీకాలు వేశారు. పశువుల సంతానోత్పత్తిని మెరుగుపరచడానికి కృత్రిమ గర్భధారణ సేవలను అందుబాటులో ఉంచి మెరుగైన జాతి పశువుల పెంపకంపై రైతులకు మార్గనిర్దేశం చేశారు. వేసవి కాలంలో పశువులకు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి గడ్డి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఆనందరావు పటేల్, గ్రామ సర్పంచ్ రత్నా సత్యనారాయణ, పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## ఉపాధిహామీ పనుల పరిశీలన

**ఆసిఫాబాద్,మే 8, ప్రభాతవార్త :**

వేసవి నేపథ్యంలో ఉపాధి హామీ పనులను డీఆర్డీఓ దత్తా రావ్ పరిశీలించారు. శుక్రవారం ఆసిఫాబాద్ మండలం బూరుగుడ గ్రామపంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల్లో భాగంగా ఫ్లడ్ డైవర్షన్ డ్రెయిన్ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. పంచాయతీలోని అందరూ కూలీలు పనికి రావాలని, సగటు వేతనం కనీసం 300 రూపాయలు వచ్చే విధంగా పనిచేయాలని కూలీలకు వివరించారు. అదేవిధంగా లేబర్ ని ప్రతి పంచాయతీలో కనీసం 150 మంది పనికి వచ్చే విధంగా లేబర్ ఇంప్రూవ్మెంట్ చేయాలని క్షేత్ర సహాయకులు, సాంకేతిక సహాయకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, సర్పంచ్ సంగీత లచ్చన్న, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ సర్కార్

● ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జన్నారం, మే 8, ప్రభాతవార్త

పేద ప్రజల కోసమే కాంగ్రెస్ సర్కారు పని చేస్తుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం రోజు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే వేడుమ బోజ్జు పటేల్ చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకం లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోజ్జు పటేల్ మాట్లాడుతూ, పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లబ్ధిదారులు ఈ ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జన్నారం మండలానికి చెందిన పలువురు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమర్ షరీఫ్, తహసీల్దార్ బక్కయ్య, డీటీ రామ్మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, పోనకల్, కలమడుగు మాజీ సర్పంచ్‌లు జక్కు భూమేష్, బొంతల మల్లేష్, కాంగ్రెస్ నాయకులు ముత్యం సతీష్, పాదం రాకేష్, హేమంత్ చారి, ముజ్జు, మంద రాజేష్, పోనకల్ వార్డు మెంబర్ మోసిన్ షా ఖాన్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.





రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్లు

## రైతులకు అవగాహన సదస్సు

వాంకిడి, మే 8, ప్రభాతవార్త :

వాంకిడి మండల కేంద్రంలోని చరీడీ గ్రామములో జ రైతు ముంగింట్లో శాస్త్రవేత్తలుచ రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ అనురాధ, సౌజన్య పాల్గొని మాట్లడుతూ రైతులు యూరియా వినియోగం తగ్గించాలని, పంట మార్పిడి చేయాలనీ, పచ్చిరొట్ట ఎరువులు వినియోగం పెంచాలని, పంట వ్యర్థాలను కాల్చకుండా వేసవి దుక్కులో కలియ దున్నలనీ తెలియచేశారు. నిషేధిత మందులు వాడొద్దని, కూరగాయ పంటలలు, నేలలో సేంద్రీయ పదార్థాలు పెంచడం వంటి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో సిఈఓ ఒమాజీ, ఏఈఓ శంకర్, అరవింద్, చర్డీ సర్పంచ్ అమృత, ఉప సర్పంచ్ సాగర్, గ్రామ పాటేల్ సంతోష్, రైతులు పాల్గొన్నారు..



## ధాన్యం కొనుగోలు వేగవంతం చేసేలా చర్యలు

- జాయింట్ కలెక్టర్ చంద్రయ్య

లక్షెట్టిపేట, మే 07, ప్రభాతవార్త

ధాన్యం కొనుగోలును వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మంచిర్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రయ్య అన్నారు. శుక్రవారం లక్షెట్టిపేట మండలంలోని వెంకటరావుపేట గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడున్న రెండు గోదాములను ఆయన పరిశీలించారు. తడిసిన ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో మిగిలిన ధాన్యంలో కలపవద్దని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ

లక్షెట్టిపేట, మే 08, ప్రభాతవార్త

లక్షెట్టిపేట మండలం కొత్తూరు గంపలపల్లికి చెందిన రైతులు ఇటీవల జరిగిన అకాల వర్షాల కారణంగా మరణించిన కుటుంబాలను పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొత్తూరుకు విచ్చేసిన ఎంపీ వంశీకృష్ణకు బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు తగరపు గంగయ్య స్వాగతం పలికారు. అనంతరం కుటుంబ సభ్యులతో పాటు వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సిర్పూర్ పేపర్ మిల్లును సందర్శించిన మంత్రి జూపల్లి

కాగజ్‌నగర్ రూరల్, మే 8, ప్రభాతవార్త :

పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం కాగజ్‌నగర్‌లోని సిర్పూర్ పేపర్ మిల్లును సందర్శించారు. ఈ సందర్భంగా మిల్లుసిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం మిల్లులోని వివిధ విభాగాలను మంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. కలప నుంచి కాగితం తయారయ్యే వివిధ దశలను మంత్రి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కలపను ముక్కలుగా చేయడం (చిప్పింగ్), ఆపై గుజ్జుగా మార్చడం, రసాయనాల వినియోగం నుంచి తుది దశలో పేపర్ రోల్స్ సిద్ధమయ్యే వరకు సాగే సంక్లిష్ట ప్రక్రియను, యంత్రాల పనితీరును మిల్లు సాంకేతిక నిపుణులు ఆయనకు వివరించారు. ఉత్పత్తి, కార్మికుల సంక్షేమం తదితర అంశాలపై ఆయన చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె హరిత ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, తదితరులు పాల్గొన్నారుజిల్లా పౌర సంబంధాల అధికారి చేజారి



ఎస్పీయం మిల్లులోని వివిధ విభాగాలను పరిశీలిస్తున్న మంత్రి

## వెంకటాపూర్‌లో ఉచిత పశువైద్య శిబిరం

నేరడిగొండ, మే 08, ప్రభాతవార్త:

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం వెంకటాపూర్ గ్రామంలో ఉచిత సమగ్ర పశుసంవర్ధక చికిత్స, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 5 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, 32 దూడలకు, 450 గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. 25 పశువులకు సాధారణ చికిత్సలు అందించి, రైతులకు సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కృష్ణ నాయక్, పశు వైద్యాధికారి డాక్టర్ రాథోడ్ జీవన్, సిబ్బంది వెంకన్న, రాజన్న, రైతులు పాల్గొన్నారు.



## ఉచిత ఇంటర్నెట్ సేవలను నిరుద్యోగ యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్ టౌన్, మే 8, ప్రభాతవార్త :

ఉచిత ఇంటర్నెట్ సేవలను నిరుద్యోగ యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని భాజపా జిల్లా యూత్ అధ్యక్షులు గాజుల రాజేంద్రప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో కొలువుల కోసం సన్నదం అవుతున్న నిరుద్యోగ యువతి యువకులకు కోసం తన స్వంత ఖర్చులతో ఇంటర్నేట్ (వైఫై)నీ అందిస్తున్నారన్నాయు. గత సంవత్సరం ఉచిత ఇంటర్నెట్ ప్రారంభించగా మళ్ళీ ఈ సంవత్సరం కూడా ఉచితంగా వైఫై సేవలను అందిస్తున్నారన్నారు. గ్రంథాలయానికి వచ్చి ఉద్యోగాల కోసం సన్నద్ధం అవుతున్న నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## భాయ్ బాల్ముకుంద్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

మందమర్రి, మే 8, ప్రభాతవార్త

భారత స్వాతంత్ర్య సమరయోధుడు భాయ్ బాల్ముకుంద్ వర్ధంతి సందర్భంగా మందమర్రి పట్టణంలోని మాజీ ఆర్మీ జవాన్, ప్రస్తుత ఎస్ అండ్ పీసీ ఉద్యోగి రాజేష్ పీవీ హాల్, రాణి పీవీ హాల్ దంపతులు శుక్రవారం తమ నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను నేటి యువతకు తెలియజేయాలనే ఉద్దేశంతో మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను ప్రతి భారతీయుడు స్మరించుకోవాలని పేర్కొన్నారు. భాయ్ బాల్ముకుంద్ 1889లో జీలం జిల్లాలోని కరియాలా గ్రామంలో (ప్రస్తుతం పాకిస్థాన్‌లో) జన్మించారని, ప్రముఖ హిందూ అమరవీరుడు భాయ్ మతీదాస్ కుటుంబానికి చెందిన విప్లవకారుడని వివరించారు. ఆయన భాయ్ పర్మానంద్ సోదరుడిగా, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విప్లవకారుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. 1912లో ఢిల్లీలోని చాందినీ చౌక్‌లో అప్పటి వైస్రాయ్ లార్డ్ హార్డింగ్‌పై జరిగిన బాంబు దాడి ఘటనలో పాల్గొన్నట్లు ఆరోపణలు ఎదుర్కొన్న భాయ్ బాల్ముకుంద్, గదర్ పార్టీ వ్యవస్థాపక సభ్యులతో కలిసి బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడారని పేర్కొన్నారు. ఢిల్లీ కుట్ర కేసులో బ్రిటీష్ ప్రభుత్వం ఆయనను దోషిగా తేల్చి, 1915 మే 8న అంబాలా సెంట్రల్ జైలులో ఉరి తీసిందని గుర్తుచేశారు. దేశ స్వాతంత్రం కోసం పిన్న వయస్సులోనే ప్రాణత్యాగం చేసిన భాయ్ బాల్ముకుంద్ గొప్ప దేశభక్తుడని కొనియాడారు. ఆయన త్యాగాలు నేటి యువతకు ఆదర్శప్రాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏదులాపురం రాజు, రాజయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.






## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు

**భైంసా, మే 08, ప్రభాతవార్త:**

భైంసాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మే 11 నుంచి 17 వరకు విద్యా వారోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కర్రోళ్ల బుచ్చయ్య తెలిపారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ వారోత్సవాల్లో విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడేలా కెరీర్ గైడెన్స్, మెడికల్ క్యాంప్, గ్రంథాలయ జ్ఞానోత్సవం వంటి వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.




ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి సుధాకర్

## ఉపాధి హామీ హాజరు శాతాన్ని పరిశీలించిన పంచాయతీ కార్యదర్శి

**సారంగాపూర్, మే 08, ప్రభాతవార్త:**

మండలంలోని కౌట్ల(బి) గ్రామంలో ముమ్మరంగా కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పంచాయతీ కార్యదర్శి సుధాకర్ పరిశీలించారు. క్షేత్రస్థాయికి వెళ్లి కూలీల హాజరు శాతం, మాస్టర్ వెరిఫికేషన్‌ను తనిఖీ చేశారు. ఆన్‌లైన్‌లో పని దినాలు సరిగా నమోదవుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పనుల్లో పారదర్శకత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణ, ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

## జనగణనపై అవగాహన మారథాన్

### - జెండా ఊపి ప్రారంభించిన కలెక్టర్ భవేష్ మిశ్రా

**నిర్మల్, మే 08, ప్రభాతవార్త:**

దేశాభివృద్ధికి కీలకమైన జనగణనపై అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్మల్ పట్టణంలో భారీ మారథాన్ నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయం నుండి ఎన్టీఆర్ మినీ స్టేడియం వరకు సాగిన ఈ పరుగును జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. దేశ ప్రగతి, సంక్షేమ పథకాల రూపకల్పనకు జనాభా లెక్కలే ప్రాధాన్యమని తెలిపారు. జనగణన2027లో భాగంగా ప్రతి పౌరుడు స్వీయ గణన విధానంపై అవగాహన కలిగి ఉండాలని, ఆన్‌లైన్ ద్వారా వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్న కళ్యాణి, సీపీఓ జీవరత్నం, డీవైఎస్ఓ కాంత్ రెడ్డి, డీఈఓ భోజన్న, ఎల్‌డీఎం రామ్ గోపాల్, డీపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



# అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై మంత్రి జూపల్లికి వినతి

**కాగజ్‌నగర్ రూరల్, మే 8, ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్ర అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ కమిటీ ప్రతినిధులు గురువారం పర్యాటక, సాంస్కృతిక మరియు అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల కోసం ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి ప్రభుత్వ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, అకారణ తొలగింపులను నిలిపివేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని ప్రతినిధులు కోరారు. అలాగే హెల్త్ కార్డులు, సర్వీస్ వెయిటేజీ, ప్రసూతి సెలవులు వంటి సంక్షేమ సౌకర్యాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యలను మంత్రి సావధానంగా విన్నారని, లక్షలాది అవుట్‌సోర్సింగ్ కుటుంబాలకు న్యాయం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు. ముఖ్యంగా ఏజెన్సీల దోపిడీ, ఉద్యోగ భద్రత అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు చెండ్యాల రామ్‌చందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పోలోజు సంతోష్‌కుమార్, జిల్లా వైస్ ప్రెసిడెంట్లు సత్యనారాయణ, అంకుష్, మీడియా ఆర్గనైజర్ బొడ్డు సాగర్ పాల్గొన్నారు.



మంత్రి జూపల్లికి వినతిపత్రం అందజేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

## మే 11 నుంచి తిర్యాని జనగణన తొలి దశ ప్రారంభం

### - తహశీల్దార్ శ్రీనివాస్

**తిర్యాని, మే8, ప్రభాతవార్త;**



భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న భారత జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా తిర్యాని మండలంలో తొలి దశ ఇళ్ల లెక్కింపు, గృహ వివరాల సేకరణ కార్యక్రమం ఈ నెల 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. జనగణన దేశ అభివృద్ధి ప్రణాళికలకు పునాది వంటిదని, గ్రామాలు, పట్టణాలు, విద్య, వైద్యం, ఉపాధి, రవాణా, తాగునీరు, పారిశుధ్యం తదితర రంగాలలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనకు అవసరమైన గణాంకాల సేకరణ ఈ కార్యక్రమం ద్వారా జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలందరూ ఇంటి వద్దకు వచ్చిన ఎన్యూమరేటర్లకు, సిబ్బందికి సరైన సమాచారం అందించి వారికి సహకరించి జనగణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.




చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ మామిడాల లలిత

## ప్రజల దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు

**తాండూర్, మే 8, ప్రభాతవార్త :**

మండుతున్న ఎండలు దృష్ట్యా ప్రయాణికులు, బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ప్రజాప్రతినిధులు, నాయకులు చొరవ తీసుకుంటున్నారు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో తాండూర్ మండలంలోని రాజీవ్ నగర్, తాండూర్, గోపాల్ నగర్ గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం స్థానిక సర్పంచులు మామిడాల లలిత, ముడిమడుగుల సురేష్, గాట్ల నరసయ్య చలివేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికులు బాటసారులకు చల్ల నీరు అందించడం కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రయాణికు బాటసారి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో స్థానిక వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.



## పోన్కల్ బాదంపల్లి హైలెవల్ బ్రిడ్జి ప్రారంభం

**జన్నారం, మే 8, ప్రభాతవార్త**

ఖానాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. జన్నారం మండలం పోన్కల్ నుంచి బాదంపల్లి మధ్య రూ.1.5 కోట్లతో నిర్మించనున్న హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రోడ్ల విస్తరణ, బ్రిడ్జిలు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. ఈ హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంతో పోన్కల్, బాదంపల్లి గ్రామాల మధ్య రాకపోకలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని, వర్షాకాలంలో రవాణా ఇబ్బందులు తొలగిపోతాయని పేర్కొన్నారు. బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన, నాణ్యతతో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనులను అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోనకల్ మాజీ సర్పంచ్ జక్కు భూమేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బెడద సత్తయ్య, నాయకులు ఇసాక్, పాదం రాకేష్, దాసరి మల్లేష్, మంద రాజేష్, అధికారులు, గ్రామస్తులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు పలు ప్రాంతాల్లో

## విద్యుత్ అంతరాయం

**వేమనపల్లి, మే 08, ప్రభాతవార్త**

వేమనపల్లి, నీల్వాయి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వేమనపల్లి మండల విద్యుత్ శాఖ ఏఈ దీక్షిత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 09 గంటల నుండి మధ్యాహం 11 గంటల వరకు 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు వేమనపల్లి, రాజారం, ఒడ్డుగూడెం, సుంపుటం, జాజులపేట, ముక్కిడిగూడెం, కల్లంపల్లి, నీల్వాయి, మామడ, కల్మలపేట, కేతనపల్లి, ముల్కలపేట, రాచర్ల, గొర్లపల్లి, కొత్తపల్లి, దస్నాపూర్, గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.